క్లుప్తంగా

గాలివీడులో 32.2 మి.మీ. వర్షం

గాలివీడు : మండలంలో మంగళవారం రాత్రి 32.2 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసినట్లు ఏఎస్‌ఓ శ్రీదుర్గ తెలిపారు. వర్షం లేక భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్న తరుణంలో మంగళవారం ఓ మోస్తారు వర్షం కురవడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. వెలిగల్లు ప్రాజెక్టు కుడి కాలువ నుంచి 0.5 టీఎంసీల నీటిని ఇప్పటికే విడుదల చేయగా, ఎగువ ప్రాంతం నుంచి వరద వస్తే తప్ప జలాశయంలో నీటిమట్టం పెరిగే అవకాశం లేదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఉపాధి పనులు తనిఖీ



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయశ్రీ

పుల్లంపేట : మండలంలోని కోనయ్యగారిపల్లి గ్రామ పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీడర్ ఛానల్ వర్క్ పనులను బుధవారం ఎంపీడీఓ జయశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు జరుగుతున్న పనుల వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి జాబ్ కార్డు కల్గి ఉన్న ప్రతి ఒక్కరికి పనులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై..

పుల్లంపేట : బుధవారం వాట్సాప్ గవర్నెన్స్‌పై ఎంపీడీఓ జయశ్రీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రజలు వారి మొబైల్ ఫోన్ ద్వారా అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ చక్రాధర్, ఏఓ శ్రీధర్ రెడ్డి, ఏపీఓ శ్రీనివాసరావు, ఏపీఎం సుబ్బలక్ష్మి, వీఆర్‌ఓ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మోటారుకు మరమ్మతులు



మోటారుకు మరమ్మతులు చేయిస్తున్న దృశ్యం

సంబేపల్లె : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సమీపంలో ఉన్న మంచినీటి బోరును బుధవారం మరమ్మతులు చేశారు. ఇటీవల బోరు మోరాయించడంతో మండల కేంద్రంలోని ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో సర్పంచ్ రామచంద్ర, పంచాయతీ అధికారులు దగ్గర వుండి చెడిపోయిన బోరు మోటారుకు మరమ్మతులు చేయించారు. దీంతో సర్పంచ్, అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

'బొప్పాయికి గిట్టుబాటు ధర కల్పిస్తాం'



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ భావన

రైల్వేకోడూరు అర్బన్ : జిల్లాలోని బొప్పాయి పంటకు గిట్టుబాటు ధర కల్పించడానికి అన్ని రకాల చర్యలు తీసుకొంటామని బుధవారం రాజంపేట సబ్‌కలెక్టర్ భావన పేర్కొన్నారు. స్థానిక సభా భవనంలో బొప్పాయి ఆమె రైతులతో మాట్లాడారు. బొప్పాయి పంటకు గిట్టుబాటు ధర కల్పించడానికి రైతులు, వ్యాపారస్తులు, దళారులను సమన్వయం చేసి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ధరల విషయంలో రైతల సమస్యలు తెలుసుకొని జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని పేర్కొన్నారు.

అంటువ్యాధులపై కళాజాత



పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరులో అంటువ్యాధులపై బుధవారం సాయంత్రం కళాజాత నిర్వహించినట్లు సెక్రటరీ సురేష్ తెలిపారు.కళాజాత బృందం అంటువ్యాధులు గురించి వివరించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే అంటువ్యాధులు ప్రబలవన్నారు. అలాగే తడిచెత్త, పొడిచెత్త వేరుచేసి డబ్బాలలో వేసి గ్రీన్ అంబాసిడర్లకు ఇవ్వాలన్నారు. అంటువ్యాధులు ఎలా వస్తాయో వివరించారు.

ఎంఈఓకు సన్మానం



వీరబల్లి : మండలంలో ఎంఈఓ–1గా పనిచేస్తూ తన సొంత స్థానమైన రామాపురం మండలానికి వెళ్లిన రామకృష్ణుడుకు బుధవారం వీరబల్లి మండల ఉపాధ్యాయులు సన్మానించారు. ఆయన మండలంలో ఒక సంవత్సర కాలంపైగా పని చేస్తూ ఎటువంటి సమస్యలు లేకుండా తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించారని ఎంఈఓ–2 కృష్ణయ్య తెలిపారు. ఆయన స్థానంలో ఎంఈఓ–1గా వీరనాగయ్య బాధ్యతలు చేపట్టారు.

పదునుపాటి వర్షం.. పనుల్లో నిమగ్నం



పీఎన్ కాలనీలో వరినారును పొలాల్లో వేస్తున్న రైతులు

మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి కురిసిన వర్షానికి ఆయా గ్రామాలలోని రైతులు వ్యవసాయ పనులల్లో నిమగ్నమయ్యారు. జూన్ ఆఖరు నుంచి వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులు వర్షం రాక కోసం ఎదురుచూసిన రైతులకు ఆలస్యంగానైనా పలకరించడంతో ఖరీఫ్ సాగుకు సంబంధించిన పనులను ప్రారంభించారు. పలు గ్రామాల్లో రైతులు వరినాట్లు వేస్తుండగా, మరి కొన్ని గ్రామాల్లో దుక్కుల్లో వేయడంలో తలామునకలయ్యారు. ప్రస్తుత వర్షానికి బోరుబావులు ఉన్న రైతులు వరిని సాగు చేస్తుండగా, బోర్లు లేని వాళ్ల వర్షధార పంటలపై ఆధారపడుతున్నారు. కాగా మండలంలో మంగళవారం 24.4 మి.మీ., బుధవారం తెల్లవారుజామున 22 మి.మీ. మేర వర్షపాతం నమోదైనట్లు మండల ఏఓ కిషోర్‌నాయక్ తెలిపారు. – సంబేపల్లె



నగరి సమీపంలో వరినాట్లు వేస్తున్న మహిళలు



ఖరీఫ్ సాగుకు పొలంలో దుక్కులు వేస్తున్న రైతు

ముమ్మర ప్రచారంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి ప్రజలు అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆమె స్థానిక నాయకులతో కలిసి ఉప ఎన్నిక ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విజయం కోసం పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఒంటిమిట్టలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి వైఎస్సార్‌సీపీ అధినేతకు బహుమతిగా అందజేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాగా పులివెందుల బలిజ సంఘం నాయకులు వీరా ఆధ్వర్యంలో పలువురు ప్రచారంలో పాల్గొని, అనంతరం జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి శాలువా కప్పి సన్మానించారు. ప్రచారంలో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, ఒంటిమిట్ట మండల అధ్యక్షుడు టక్కోలు శివారెడ్డి, మండల సీనియర్ నాయకుడు మేకపాటి నందకిశోర్‌రెడ్డి, ఒంటిమిట్ట సర్పంచ్ కత్తి సుజాత, వైఎస్సార్‌సీపీ నేతలు పులి సునిల్, యానాదయ్య, కడప డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, పాకా సురేష్, కౌన్సిలర్లు జైచంద్రారెడ్డి, రామలక్ష్మణరెడ్డి, గొల్లపల్లి సర్పంచ్ దుస్సూతల లక్ష్మీనారాయణరెడ్డి, నరవకాటిపల్లి ఉపసర్పంచ్ బ్రహ్మానందరెడ్డి, నడింపల్లి సర్పంచ్ పోలి నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంచంద్రారెడ్డి, ఏకుల రాజేశ్వరి

పారదర్శకతకే సమాచార చట్టం

సంబేపల్లె : పారదర్శకత కోసం ప్రభుత్వ వద్ద ఉన్న సమాచారాన్ని సమాచార హక్కు చట్టం–2005 చట్టాన్ని అప్పటి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని మండల వ్యవసాయ అధికారి కిషోర్‌నాయక్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో చట్టంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సమాచారాన్ని పొందేందుకు ప్రతి పౌరుడు అర్హుడన్నారు. ప్రజలకు తమకు కావాల్సిన సమాచారానికి సంబంధిత అధికారులకు ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. ప్రతి ఒక్కరూ చట్టం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏఓ కిషోర్‌నాయక్

ప్రతి కార్యకర్తకు తోడుగా ఉంటా

గాలివీడు : మండలంలో పలు శుభకార్యాలు, పరామర్శ కార్యక్రమాలలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. మండలంలోని వైఎస్సార్ వెలిగల్లు, గాలివీడు గ్రామంలో జరిగిన పలు వివాహాలు, నూతన గృహ ప్రవేశాలలో మండల నాయకులతో కలిసి హాజరయ్యారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బాబా ఫక్రుద్దీన్‌ను ఆయన నివాసంలో కలుసుకుని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలానే తూముకుంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఆంజనేయులురెడ్డి సతీమణి ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్కరికి తోడుగా ఉంటానన్నారు. పని చేసేవారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని, కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియజేసే బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. యువత, మహిళలు, రైతులు, మైనార్టీలు, విద్యార్థులు ఇలా అన్ని వర్గాలను చంద్రబాబు ప్రభుత్వం వంచించిందని మండిపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ డీసీపీ జిల్లా సుదర్శన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల నాగభూషన్ రెడ్డి, పార్టీ కన్వీనర్ యదుభూషన్ రెడ్డి, సర్పంచ్‌లు చెన్నకేశవ రెడ్డి, రామాంజులు రెడ్డి, వాటర్ షెడ్ చైర్మన్ రమణారెడ్డి, మైనార్టీ నాయకులు ఖలీల్, మహిళా అధ్యక్షురాలు నాగేశ్వరమ్మ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్రమణ రెడ్డి, ఇందుకూరి వెంకటరమణారెడ్డి, విశ్వనాథ రెడ్డి, బీసీ నాయకుడు రెడ్డి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబా ఫక్రుద్దీన్‌ను పరామర్శిస్తున్న శ్రీకాంత్ రెడ్డి

శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయాలి

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి నియోజకవర్గంలోని రైతులు పండించిన పంటలు నిల్వ ఉంచేందుకు శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలని సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో రాయచోటి నియోజకవర్గ 7వ మహాసభ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా రైతులు టమాటా, మామిడి మొదలైన పంటలు పండించి గిట్టుబాటు ధర లేక పొలాల్లోనే వదిలేస్తున్నారని తెలిపారు. టమాటా ఆధారిత పరిశ్రమ మామిడి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలానే త్వరితగతిన శీతల గిడ్డంగుల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని తెలియజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శిగా సిద్దిగాళ్ల శ్రీనివాసులు, సహాయ కార్యదర్శిగా జక్కల వెంకటేశు, కార్యవర్గ సభ్యులుగా ఎం.సుమిత్ర, పి.కోటేశ్వరరావు, వంగిమళ్ల రంగారెడ్డి, ఓబులేసు, రమేష్‌నాయక్, జగన్ బాబులతో పాటు 19 మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్ తెలిపారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు

నిధులన్నీ అమరావతికేనా.. బాబూ?


రాయచోటి జగదాంబసెంటర్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అమరావతిపై ఉన్న ప్రేమ రాష్ట్రంలో మిగతా ప్రాంతాలపై కూడా ఉండాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి కోరారు. బుధవారం కూటమి ప్రభుత్వం జిల్లాల అభివృద్ధిపై చూపిస్తున్న నిర్లక్ష్యంపై పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సీఎంగా పని చేసిన చంద్రబాబు హైదరాబాద్ అభివృద్ధికి మాత్రమే బడ్జెట్‌లో అధిక నిధులు వెచ్చించి, తెలంగాణలోని ఇతర ప్రాంతాలను గాలికివదిలేశారని, ఈ కారణంగా తెలంగాణ రాష్ట్ర విభజన అంశం తెరపైకి వచ్చిందన్నారు. ప్రస్తుతం కూడా ఆయన వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, అమరావతి నిర్మాణం పేరుతో రాష్ట్రాన్ని పట్టించుకోవడంలేదని, నిధులన్ని అమరావతికే కేటాయిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఆయన నూతనంగా ఏర్పడిన జిల్లాలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. లేకుంటే తీవ్రవ్యతిరేకత ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలియజేశారు.

పోలీసు బలగాల ఫ్లాగ్ మార్చ్



ఒంటిమిట్ట : ఈనెల 12న ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నిక నేపథ్యంలో మండలంలోని మంటపంపల్లి, మారయ్యగారిపల్లి, చిన్నకొత్తపల్లి, పెన్నపేరూరు, తప్పెటవారిపల్లి సమస్యాత్మక గ్రామాలలో జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కడప సబ్ డివిజన్ పోలీసు ఆఫీసర్ ఎ.వెంకటేశ్వర్లు ఉత్తర్వుల అనుసారం సాయుధ బలగాలతో పోలీసు అధికారులు ఫ్లాగ్ మార్చ్, కార్డన్ అండ్ సర్చ్ నిర్వహించారు. ప్రశాంత ఎన్నిక నిర్వహణకు అందరూ సహకరించాలన్నారు. ప్రశాంతతకు భంగం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒంటిమిట్ట సీఐ టి.బాబు, కడప తాలుకా ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్, కడప టౌన్ ఎస్‌ఐ సిద్దయ్య, స్పెషల్ పార్టీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీహెచ్‌ఓ కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న డీపీఎంఓ, వైద్య సిబ్బంది

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా మదనపల్లె డివిజన్ పరిధిలోని చెంబకూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌ఓగా తులసీ విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబానికి అన్నమయ్య జిల్లా డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్ బృందం ఆర్థిక సాయం అందించారు. గురువారం వారికి ఇంటికి వెళ్లిన అధికారుల బృందం ఆర్థిక సాయాన్ని అందజేశారు. తులసీ కాన్పు సమయంలో తీవ్ర రక్తస్రావం కావడంతో అనారోగ్యానికి గురై మరణించిందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీధర్, ఏపీఎంకే జిల్లా అధ్యక్షులు సాల్మన్ రాజు, కార్యదర్శి భాస్కర్, ట్రెజరర్ అహమ్మద్ బాషా, సీహెచ్‌ఓలు మసూద్ ఖాన్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

లక్కిరెడ్డిపల్లి : తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యాన్ని అందిస్తాయని లక్కిరెడ్డిపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ జహారా బీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కోనంపేట–2 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మట్లాడుతూ డబ్బాపాలు వద్దు తల్లిపాలు ముద్దు అని చెప్పారు. పుట్టిన బిడ్డకు మొదటి గంటలోనే తల్లిపాలు పట్టించాలన్నారు. మొదటి ఆరు నెలలు తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమన్నారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల బ్రెస్ట్ క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధికి దూరంగా ఉండవచ్చని తెలిపారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మస్తానమ్మ, కార్యకర్తలు నాగమణి, అనిత, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.



లక్కిరెడ్డిపల్లె: తల్లిపాలు విశిష్టతను వివరిస్తున్న సీడీపీఓ జహరాబీ

ఏయూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో..

రాజంపేట : తల్లిపాల ప్రాముఖ్యతపై అన్నమాచార్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తాళ్లపాక గ్రామంలో బుధవారం అవగాహన కల్పించారు. వీసీ సాయిబాబారెడ్డి మార్గదర్శకత్వంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.జనార్దన్, ఏఐటీఎస్ ప్రిన్సిపల్ డా.నారాయణ, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి డా.ఎల్.ఓబులపతిల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి తల్లి కనీసం ఆరునెలల పాటు తమ శిశువుకు తల్లిపాలను ఇవ్వాల్సిన అవసరాన్ని వివరించారు. మాతృపాల విశిష్టతపై గర్భిణులు, బాలింతలు అవగాహన కలిగివుండాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, తాళ్లపాక గ్రామస్తులు పాల్గొన్నారు.

డబ్బా పాలు వద్దు.. ముర్రిపాలు ముద్దు

పెనగలూరు : డబ్బా పాలు వద్దు.. తల్లిపాలు ముద్దు అని ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మలా జ్యోతి అన్నారు. బుధవారం నల్లపురెడ్డిపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లులతో సమావేశాన్ని నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రిపాలు తాపించాలన్నారు. ఆ ముర్రిపాలు బిడ్డలకు అమృతంలాగా పనిచేస్తుందని వారు తెలియజేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు విజయకుమారి, వసుందరమ్మ, సురేఖ రాణి, ఐసీడీఎస్ సిబ్బంది గంగాదరమ్మ, చెంచులక్ష్మి, పార్వతి, నేలమ్మ తదితరులు పాల్గొన్నారు.



పెనగలూరు: గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ



రాజంపేట: బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

విశిష్టం.. వరలక్ష్మీ వ్రతం

- రేపు వరలక్ష్మీ వ్రతం
- అమ్మవారి ఆలయాల్లో ముమ్మర ఏర్పాట్లు

రైల్వేకోడూరు అర్బన్ : శ్రావణ మాసంలో అత్యంత ప్రశస్థమైనది శ్రావణ శుక్రవారం. శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతం జరుపుకోవడం ఆనవాయితీ. ఆగష్టు 8న (రేపు) శ్రావణ శుక్రవారం కావడంతో లక్ష్మీదేవి ఆలయాలతో పాటు అమ్మవార్ల ఆలయాల్లో సామూహిక వ్రతాలను ఆచరించడానికి ముస్తాబు చేశారు. మహిళలు ఇప్పటికే వ్రతానికి అవసరమయ్యే సామగ్రిని సమకూర్చుకోగా, ఆలయాల కమిటీలు సైతం ఏర్పాట్లు చేశాయి. ముఖ్యంగా రైల్వేకోడూరు పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానం, గుండాలపల్లెలోని మారమ్మ, బొజ్జవారిపల్లెలోని రేణుకాయల్లమ్మ, గంగమ్మ, రాఘవరాజపురంలోని భ్రమరాంబికా, పట్టణంలోని భుజంగేశ్వర ఆలయాలలో అమ్మవార్లకు అభిషేకాలు, అలంకరణలు చేయనున్నారు. హిందూ సంప్రదాయంలో వరలక్ష్మీ వ్రతానికి ప్రత్యేకత ఉంది. శ్రావణ మాసంలో వచ్చే వరలక్ష్మీ వ్రతం కోసం మహిళలు ఎదురుచూస్తుంటారు. శుక్రవారం ఉదయం భక్తిశ్రద్ధలతో ఇల్లును శుభ్రపరుచుకొని కలశాన్ని స్థాపించి పట్టుచీరతో అమ్మవారి ప్రతిమను అలంకరించి ప్రత్యేక పదార్థాలు వండి వ్రతం ముగిశాక అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తుంటారు. వరాలిచ్చే వరలక్ష్మీ రావమ్మా అంటూ పాటలు పాడి వ్రతాన్ని ముగిస్తారు.



అమ్మవారిశాలలో కొలువైన కన్యకాంబ

సమస్యల పరిష్కారానికే 'టీ తాగుదాం.. చర్చించుకుందాం'

రాయచోటి టౌన్ : సమస్యల పరిష్కారంలో భాగంగానే 'టీ దాగుదాం.. చర్చించుకుందాం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. గురువారం రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగుల సమస్యలపై చర్చావేదిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన పీఆర్‌సీ, అరియర్, డీఏ, సరెండర్ లీవ్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినప్పటికీ కనీసం స్పందన కూడా లేదని ఆరోపించారు. ఇప్పటికే సుమారు రూ.25 వేల కోట్లు బకాయిలు పేరుకుపోయాయన్నారు. ఇదంతా ఎలా చెల్లిస్తారనే అలోచనతో రాష్ట్ర అధ్యక్షులు ఒక సూచన చేశారని అది మనకు ఎంత మొత్తం వస్తుందో అంతకు సమానంగా ప్రభుత్వం ఉద్యోగులకు ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాలు ఇప్పించాలని సూచించినట్లు తెలిపారు. అది కూడా పూర్తిగా ప్రభుత్వ ధరల ప్రకారం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. సత్వరం బకాయిలు చెల్లించడమో.. లేదా ఇంటి స్థలాలు ఇప్పించడమో చేయాలని కోరారు. ఇందుకు సమావేశానికి హాజరైన సహచర ఉద్యోగులు అందరూ ముక్తకంఠంతో ఏకీభవించి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. అలాగే సహచర ఉద్యోగులు వారి సమస్యలు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సంఘం తాలూకా అధ్యక్షులు ఓ.సాయి కుమార్, కార్యదర్శి సుజిత్ దాల్, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రాజ, డాక్టర్లు వెంకట శివ, కోటేశ్వమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను వివరిస్తున్న వైద్య సిబ్బంది

చేనేతకు ఇచ్చిన హామీలు నీటిపై రాతలేనా?

రాయచోటి టౌన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు కావస్తున్నా ఎన్నికల సమయంలో చేనేత కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ నీటి మీద రాతలే అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత సంవత్సరం ఆగస్టు 7వ తేదీన చేనేత దినోత్సవాన్ని పురస్కరించిన చంద్రబాబు చేసిన హామీలలో ఇప్పటికీ ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. నేతన్నకు 200 యూనిట్‌లు విద్యుత్, జీఎస్‌టీ రద్దు, చేనేత పింఛన్ అమలు, ఆరోగ్య బీమా హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ఇప్పటి వరకు ఒకటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. అదే గత ప్రభుత్వంలో జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్లలో ఐదు విడతలలో ఒక్కో చేనేత కుటుంబానికి రూ.1,20,000లు ఆర్థిక సాయం అందించారని పేర్కొన్నారు. చేనేతలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఇప్పటికైనా వారికి చేసిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రవీంద్ర యాదవ్, సంజీవయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు

మాదకద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారం

వీరబల్లి : విద్యార్థులు లక్ష్యాలను సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలతో జీవితాలు ఛిద్రమవుతాయనే విషయాన్ని తెలుసుకోవాలని ప్రిన్సిపల్ అజంతుల్లా సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకునేందుకు బాటలు వేయాలని, మాదకద్రవ్యాలకు బానిసై బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోకూడదని తెలియజేశారు. టీనేజ్‌లో పడే అడుగులే జీవితాలను నిర్దేశిస్తాయనేది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం ఆయన యాంటీ ర్యాగింగ్, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ వాడకంతో వచ్చే అనర్థాలను విద్యార్థులకు తెలియజేశారు. చదువులో రాణించి ఉన్నతస్థాయిలో స్థిరపడాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రఘురామయ్య తెలిపారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అజంతుల్లా

ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై దాడి అమానుషం

నందలూరు : వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై టీడీపీ గుండాలు దాడి చేయడం అమానుషమని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాజంపేట నియోజకవర్గ అధ్యక్షులు బయనబోయిన భాస్కర్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయం అంటే ప్రజల్లోనే నిలబడి ఓటు అడిగి గెలవండి అంతేగాని సౌమ్యుడు మంచితనానికి మారుపేరైనటువంటి ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి, నిన్నటి రోజు వివాహ కార్యక్రమానికి వచ్చిన కొంతమంది వైఎస్ఆర్‌సీపీ నాయకుల మీద దౌర్జన్యానికి పాల్పడటం దుర్మార్గమన్నారు. టీడీపీ జెడ్పీటీసీ అభ్యర్థి పులివెందులలో ఓడిపోతున్నాడు కాబట్టే దాడులకు తెగబడుతున్నారు. ఇకనైనా టీడీపీ నాయకులు నీచ సంస్కృతిని పక్కన పెట్టి ప్రజాబలంతో గెలవాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే మళ్లీ రాయలసీమలో ఫ్యాక్షన్ పురుడు పోసుకోవడం ఖాయమని చెప్పారు. ప్రజాబలంతో గెలవాలి తప్ప దాడులు చేసి జనాలను భయభ్రాంతులకు గురిచేసి గెలవాలనుకోవడం అప్రజాస్వామికమన్నారు. చంద్రబాబునాయుడు ప్రజలకు మేలు చేసి ఉంటే కూటమి నాయకులు ఎందుకు భయపడుతున్నారని పేర్కొన్నారు. టీడీపీ గుండాలు మీకు నిజంగా ప్రజాబలం ఉంటే



బయనబోయిన భాస్కర్‌యాదవ్

కళాత్మక విద్యను బోధించండి

రాయచోటి టౌన్ : ఛాత్రోపాధ్యాయులు తమ నైపుణ్యానికి అనుభవం ఆధారంగా కళాత్మక విద్యను బోధించాలని డైట్ సీనియర్ అధ్యాపకులు మడితాటి నరసింహారెడ్డి సూచించారు. గురువారం ఛాత్రోపాధ్యాయులు రూపొందించిన వివిధ రకాల బోధనోపకరణలు, కళాత్మక వస్తువుల ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కళాత్మక పరికరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ఛాత్రోపాధ్యాయులు అమ అనుభవాన్ని, కళాత్మకను మిళితం చేసి రూపొందించిన పరికారాలు ఎంతో విలువైనవన్నారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు శివభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



పరికరాలను ప్రదర్శిస్తున్న ఛాత్రోపాధ్యాయులు